క్లుప్తంగా

వేతనాల్లేక అలమటిస్తున్నాం..



చౌడువాడలో చెత్తను తీసుకెళుతున్న పారిశుధ్య కార్మికులు

కోటవురట్ల : పల్లెల్లో వీధులను శుభ్రం చేసి పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్న కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. కొద్ది నెలలుగా వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో తిండికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. మండలంలో సుమారు 60 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. తెల్లారి లేస్తే వీధుల్లో రిక్షా తొక్కుతూ చెత్తను సేకరించి ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేస్తారు. అందరి ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న తమకు మాత్రం తినడానికి తిండి కూడా దొరకడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

మునగపాక: ప్రజా సమస్యలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని ఈవోఆర్డీ ఎం.వెంకటలక్ష్మి కోరారు. సోమవారం ఆమె మండలంలోని పల్లపు ఆనందపురం పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం రక్షితమంచినీటి పథకాన్ని పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్యం ,తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అజ్మీర్ షరీఫ్‌లో చాదర్ సమర్పణ



చాదర్ సమర్పిస్తున్న చాంద్‌బాషా

కోటవురట్ల: రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో ఉన్న ఖ్వాజా మొహినుద్దీన్ చిస్టి రెహమాతుల్లా అలై వారి దర్గాను స్థానిక ముస్లిం కాలనీకి చెందిన చాంద్ బాషా కుటుంబసభ్యులు సోమవారం సందర్శించారు. చాంద్ బాషా మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన ఖ్వాజా మొయినుద్దీన్ చిస్టీ రెహమాతుల్లా అలై వారి దర్గాలో ముస్లిం కాలనీ మజీద్ ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ తరపున చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించి, పుష్పాలు, మిఠాయిలను అందజేసినట్టు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాహ్‌కు దువ చేసినట్టు తెలిపారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ జరగాలి

మునగపాక : ఆగస్టు నెలకు సంబంధించిన పింఛను పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోగా పింఛను పంపిణీ శతశాతం పూర్తవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకుంటూ పింఛను పంపిణీ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి సమావేశంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: పి.ధర్మవరం ఆర్‌డబ్ల్యుఎస్ స్కీమ్‌కి సరఫరా అయ్యే విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేయబడుతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ ట్యాంకుకు తాగునీటి సరఫరా చేసేందుకు ఉన్న విద్యుత్ లైనులో మెయిటెనెన్స్ పనులు, పిచ్చి తుప్పలు తొలగింపు పనుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భయం..భయం ఈ బ్రిడ్జిపై ప్రయాణం

- భారీ వాహనాలకు కళ్లెం వేయాలి
- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- స్థానికుల వేడుకోలు



మునగపాక మెయిన్‌రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు



శిథిలావస్థకు గురైన మునగపాకలోని కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి

మునగపాక: ఒకవైపు భారీ వాహనాలు మరోవైపు మండల కేంద్రమైన మునగపాకలో శిథిలమైన బ్రిడ్జితో పూడిమడక రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల కాలం నాటి బ్రిడ్జిపై ప్రయాణం అలాగే పరిమితికి మించి వాహనాల రాకపోకలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో బ్రిటిష్‌కాలం నాటి బ్రిడ్జి...

మండల కేంద్రమైన మునగపాక కృష్ణంరాజు కాలువపై గత 150 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలకులు బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా నాణ్యతతో కూడిన పనులు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు ఏళ్లు గడుస్తున్నాయి. దీంతో బ్రిడ్జి నేడు శిథిలావస్థకు చేరుకుంది. కాలువపై నిర్మించిన బ్రిడ్జి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే బ్రిడ్జి అడుగుభాగం మొత్తం దెబ్బతింది. పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడం ద్వారా బ్రిడ్జి ఏ క్షణమైనా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. అధికారులు ఆలోచన చేసి ప్రమాదం జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిమితికి మించి భారీ వాహనాలతో ముప్పు ..

పూడిమడక రోడ్డులో భారీ వాహనాలకు అవకాశం లేదు. 25 టన్నులకు మించి ఈ మార్గంలో రాకపోకలకు వీలు లేదు. అయినా భారీ వాహనాలు ఇదే మార్గంలో 60 టన్నులకు పైగా లోడుతో ప్రయాణం చేస్తున్నాయి. అనకాపల్లి బైపాస్ దరి భారీ వాహనాలకు అవకాశం లేదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోతుంది. పగలు,రాత్రులు తేడా లేకుండా నిత్యం భారీ వాహనాలు రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. నివారించాల్సిన అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అచ్యుతాపురంలోని ఎస్ఈజెడ్‌కు సంబంధించి నిత్యం వేలాది మంది ఉద్యోగులు పలు బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ శిథిల బ్రిడ్జిపై ప్రయాణం భయంగా ఉంటుందని వాపోతున్నారు. భారీ వాహనాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి



బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి నేడు ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి శిథిలావస్థకు గురైనా భారీ వాహనాల రాకపోకలు తగ్గలేదు. దీంతో ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

–టెక్కలి జగ్గారావు, సీపీఎం నేత, మునగపాక

భారీ వాహనాలు నియంత్రించాలి



మునగపాకలో కృష్ణంరాజు కాలువపై నిర్మించిన బ్రిడ్జి శిథిలం కావడంతో ప్రయాణం భయంగా ఉంటుంది. బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి కావడంతో ప్రమాదం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలపై అధికారులు చర్యలు చేపట్టాలి.

–యల్లబిల్లి కొండబాబు, ద్విచక్ర వాహనదారు, గొల్లలపాలెం

చర్యలు తీసుకుంటాం



పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలపై పలు మార్లు హెచ్చరించాం. పరిమితికి మించి లోడుతో వాహనాలు వస్తే చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జి పరిస్థితిని అర్థం చేసుకొని భారీ వాహనాలు నడిపేవారు తగు ఏర్పాట్లు చేసుకోవాలి. ఇప్పటికే భారీ వాహన డ్రైవర్లకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశాం. పరిమితికి మించి వాహనాలొస్తే చర్యలు తప్పవు.

–పి.ప్రసాదరావు, ఎస్‌ఐ,మునగపాక

మత్స్యకార భరోసా అందించాలి

- జెడ్పీటీసీ నాగరాజు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి ఎరిపిల్లి చక్రవర్తి
- డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం



డిప్యూటీ తహసీల్దార్ శేషుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాంబిల్లి (యలమంచిలి) : మత్స్యకారులకు మత్స్యకార భరోసాను కూటమి ప్రభుత్వం వెంటనే అందజేయాలని రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి ఎరిపిల్లి చక్రవర్తి డిమాండ్ చేశారు. మత్స్యకారులకు వేట నిషేధంలో ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం, మత్స్యకార భరోసాపై సోమవారం రాంబిల్లి తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శేషుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వరకు వేట నిషేధంలో ప్రభుత్వం ఏటా అందజేస్తున్న మత్స్యకార భరోసా 15వేల రూపాయలను వెంటనే ప్రభుత్వం అందజేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారులకు రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకూ నిధులు అందజేయలేదని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా 60 రోజుల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవనభృతిగా వారి ఖాతాల్లో నేరుగా 15 వేల రూపాయలను క్రమం తప్పకుండా ఇవ్వడం జరిగిందన్నారు. మత్స్యకార భరోసా అందక పోవడం వల్ల ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వేటకు వెళ్లక మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అందువల్ల తక్షణం ప్రభుత్వం వారి ఖాతాల్లో నిధులు జమ చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు తీరని అన్యాయం



బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

మునగపాక : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరగడాన్ని నిరసిస్తూ సోమవారం మునగపాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు సంఘాల నేతలు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు శ్రీనివాసరావు, మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపించారన్నారు.అలాగే గ్రామీణ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రైతులకు సంబంధించిన కనీస మద్దతు ధరలు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. దీంతో భవిష్యత్‌లో వ్యవసాయ రంగం కుదేలవుతుందన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా జరగనున్న ఆందోళనకు ప్రజలు మద్దతు అందించాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మాజీ, రాము,రమణ తదితరులు పాల్గొన్నారు.

‘మహిళా కార్మికులకు వేధింపులు’

అచ్యుతాపురం : మండలంలోని ఒక దుస్తుల కర్మాగార అనుబంధ కంపెనీలో ఒక ఉద్యోగిని వేధింపులకు గురై మృతి చెందారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆరోపించారు. కంపెనీలో పనిచేసే మహిళా ఉద్యోగులకు వేధింపులు ఎక్కువ అయ్యాయని, జీతం పెంచమని అడిగితే మహిళా ఉద్యోగుల్ని తొలగిస్తున్నారని అన్నారు. రాత్రి వేళల్లో మహిళా ఉద్యోగుల చేత పని చేయించకూడదనే నిబంధనలు ఉన్నా ఆ కంపెనీ నిబంధనలను అమలు చేయడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో సోమునాయుడు,కాశీ,నాయుడు,అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాల్వలు కప్పేశారు...



రీ సర్వే డీటీ పడాల్‌కు వినతి అందజేస్తున్న రైతులు

మునగపాక : సాగునీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ డిమాండ్ చేశారు. మునగపాక మెయిన్‌రోడ్డు దరి లే–అవుట్ల కారణంగా సాగునీటి కాలువలు కప్పేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సాగునీటి కాలువలను పైపులతో కప్పేయడంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదన్నారు. దీంతో ఎగువ ప్రాంతాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అనంతరం రీ–సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. కాగా రైతులకు అసౌకర్యం కలిగించేలా ఉన్న ఇరిగేషన్ ఏఈ చర్యల పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక : పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మునగపాక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం కూలీలు సోమవారం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారాల తరబడి ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు సకాలంలో అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ, సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు,టెక్కలి జగ్గారావు, సూరిబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కర్మయోగం విశిష్టతను తెలుసుకోవాలి..



త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల: కర్మయోగం విశిష్టత గురించి తెలియజేసేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని హిందూ ధర్మ ప్రచార ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు శాంతరాజు తెలిపారు. ప్రతి మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని త్రైత సిద్ధాంత భగవద్గీత చెబుతోందన్నారు. జీవాత్మ, పరమాత్మ, ఆత్మల పరమార్థాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవడానికి భగవంతుడు అందించిన ఏకైక జ్ఞాన మార్గం భగవద్గీత అన్నారు. ఆది మధ్యాంత రహితుడైన పరమాత్మ భూమిపై జన్మిస్తే ఆయనను గురువు అంటామన్నారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువుగా గుర్తించాలన్నారు. సాక్షాత్తూ శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు స్వామినాయుడు, నాగేశ్వరరావు, సత్యవతి, వ్యాస్, జలంధర్ పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఉచిత ఇసుక

- సీపీఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన ఉచిత ఇసుక పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో లేదని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు విమర్శించారు. మండలంలో ప్రజలకు ఎక్కడ ఉచిత ఇసుక అందుతుందో నేటికీ తెలియడం లేదని వాపోయారు. ఈ కారణంగా పేద, మధ్య తరగతుల ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయినట్లు తెలిపారు. ఈ రంగంపై ఆధారపడిన మేస్త్రీలు, కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఉచిత ఇసుకపై క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని గుర్తించాలని కోరారు.

1న చీరలు, కొబ్బరి చెక్కల హక్కు వేలం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దేవదాయశాఖ ఆధ్వర్యంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి నివేదించిన చీరలు, రవికెలు, కొబ్బరి చెక్కలను ఏడాదిపాటు పొందేందుకు టెండర్, బహిరంగ వేలంను వచ్చే నెల 1న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజ సులోచన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్సు హక్కు చీరలు, రవికెలకు 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు, కొబ్బరి చెక్కల సేకరణకు ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఉంటుందన్నారు.

విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం



రాజుపేటలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. వారం రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారిలో జిజ్ఞాస కలిగేలా ఆసక్తికరంగా నిర్వహించారు. ఆఖరి రోజున శుభ్ తిథి భోజన్ కార్యక్రమం చేపట్టి దాతల సాయంతో విద్యార్థులకు విందు భోజనం అందించారు. రాజుపేట ఎంపీయూపీ, గొల్లపేట ఎంపీపీ స్కూల్స్‌లో హెచ్‌ఎంలు ఆర్.నానిమణిమోహన్, జీవన్‌ల ఆధ్వర్యంలో శుభ్‌దిన్ భోజన్ నిర్వహించి మధ్యాహ్న భోజనంతో పాటు దాతల సహాయంతో అరటిపండ్లు, స్వీట్లు, పాయసం, సేమియా వంటి వంటకాలు, పండ్లను అదనంగా అందించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రులు సహకారం అందించాలన్నారు. సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ ఆళ్ల శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనాలు

నక్కపల్లి: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఎంఈవో కుంచం నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. సోమవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో దాతల ద్వారా శుభతిథి భోజనాలను అందించడం శుభపరిణామమన్నారు. స్థానిక హెచ్‌ఎం రాణిలలిత , పూర్వ విద్యార్థులు, స్థానిక దాతలను సమీకరించి వారి ద్వారా శుభతిథి భోజనాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. జాతీయ విద్యావిధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సప్తాహ్ కార్యక్రమం వారం రోజుల పాటు ఘనంగా జరిగిందన్నారు. ఈ వారం రోజులు విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. లోగడ తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసిన ఎన్‌వీఎస్ ఆచార్యులు, టీడీపీ నాయకులు, కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబులు సప్తాహ్ కార్యక్రమానికి కొంత మొత్తాన్ని విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం హెచ్‌ఎం రాణిలలితను ఘనంగా సన్మానించారు. చినతీనార్లలో మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరయ్య కుటుంబ సభ్యుల సాయంతో శుభతిథి భోజనాలను ఏర్పాటు చేశారు. వేంపాడు, పెద బోదిగల్లుం, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లోకూడా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. పేరెంట్స్ కమిటీ నాయకులు కోసూరు శ్రీను, కక్కిరాల సురేష్, లోవ కన్నాబాబు, పాడగట్ల వెంకటేశ్వరరావు, అప్పలరాజు,హెచ్‌ఎంలు మూర్తిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



నక్కపల్లి హెచ్‌ఎం రాణిలలితను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండలంలో పలు పాఠశాలలో స్థానిక నాయకులు స్వంత నిధులతో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. సైతారుపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ రావి రమణబాబు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అరటి పళ్లు తీసుకువచ్చి పంపిణీ చేశారు. సర్వసిద్ధి యూపి స్కూల్‌లో స్థానిక నాయకులు పడమట సతీష్ విద్యార్థులకు ఆపిల్ పండ్లు ఇచ్చి విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని కోరారు. ఏఎంవో మురళీపట్నాయక్, మండల విద్యాశాఖాధికారి మూర్తి పాల్గొన్నారు.

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని మునగపాకకు చెందిన బీలా స్రవంతి కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శుభదిన భోజన పథకంలో భాగంగా సోమవారం ఆమె మునగపాకలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమానికి ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో బీలా లక్ష్మణరావు పాల్గొన్నారు.



సైతారుపేటలో పాఠశాలలో విద్యార్థులకు అరటి పండ్లు అందిస్తున్న సర్పంచ్, ఏఎంవో, ఎంఈవో



సర్వసిద్ధి పాఠశాలలో విద్యార్థులకు ఆపిల్ పండ్లు అందజేస్తున్న దృశ్యం

కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



శరీరంపై మచ్చలను పరిశీలిస్తున్న వైద్యాధికారి కల్యాణి

అచ్యుతాపురం: కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కల్యాణి అన్నారు. మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు ప్రారంభించారు. శరీరంపై రాగి రంగు గల మచ్చలు ఉన్నా, చేతులు, కాళ్లు పట్టు తప్పినట్లు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జూలై 18 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన, సంబంధిత వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. అనుమానం ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.